74
ధారావాహిక



# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ :** జాయప, కాకతి.. మిథున శిల్పాలకు ప్రతీకలుగా నిలబడుతున్నారు. జాయపుని కోసం ఏమైనా చేస్తుంది కాకతి. జాయపుడు కళ కోసం నిలబడితే.. ఆమె జాయపుని కోసం నిలబడింది. ఇటు జాయపుని ఆలోచనలూ అలాగే ఉన్నాయి. తనకోసం ఇంత చేస్తున్న కాకతికి ఏమివ్వగలడు?! జీవితం ఇవ్వాల్సిందేనా!? మరోవైపు నారాంబ.. పలకరిస్తే పలకలే నంత పని ఒత్తిడిలో ఉంది. జాయపునికి వివాహ సంబంధాలు చూస్తూ.. రేయింబవళ్లూ అదే ధ్యాస - అదే పని!

గణపతిదేవుడు కూడా.. ఆయనతో జాయపుని పెళ్లి గురించి ప్రస్తావించిన వాళ్లను ఆనందంగా నారాంబ వద్దకు పంపేసి, చేతులు దులుపుకొంటున్నాడు. ఆమె వివాహసంబంధ ఆలోచనల్లో ఎంతగా మునిగిపోయిందంటే.. జాయపుడు ఎప్పుడు వచ్చి వెళ్తున్నాడో కూడా గుర్తించలేనంత! జాయపుడు రానురానూ అంతఃపురానికి రావడం తగ్గించి, ఎక్కువ సమయం చతుష్పథ పురనివాసంలోనే గడుపుతున్నాడు. చివరికి నారాంబ చర్చించి చర్చించి.. మదించి మదించి.. ఓ సంబంధం ఖాయం చేసింది. భర్తకు నివేదించింది. గణపతిదేవుడు ఆ సంబంధం వివరాలన్నీ కూలంకషంగా విన్నాడు.

''జాయపుని అంగీకారం ముఖ్యం. అతనితో చర్చించు. నువ్వు అనవసరంగా ఓ అమ్మాయి పట్ల ఇష్టం పెంచుకోకు. జాయపుడు 'వద్దు!' అంటే మళ్లీ నువ్వే అవమానపడతావు.. తస్మాత్ జాగ్రత్త!!'' అన్నాడు.

మంచి సమయం చూసి ఓరోజు ప్రకటించింది.

''జాయా.. నీకు వివాహ సంబంధం నిర్ణయించాను. బావగారు కూడా సుముఖులే!''.

జాయపుడు ఉత్సుకతతో ఆగిపోయాడు.

''అక్కా.. తాళి కట్టాల్సిన వాణ్ని. వివరాలు తెలుసుకో వచ్చునా?''.

''నీకు బాగా తెలిసిన.. నువ్వు మెచ్చిన అమ్మాయి.. ఇంద్రాణి!''.

* * *

ప్రభాత వేళ.. రాజనగరి ఉద్యానవనంలో ప్రౌఢ మహిళలు, ముదుసలి జంటలు సాధారణ వ్యాయామాలు చేస్తున్నారు. లోపలికి రాకుండానే ప్రాకారం నుంచి లోపలికి చూశాడు జాయపుడు. అతని వెదుకులాట ఇంద్రాణి కోసం. ఆమె జాడ లేదు.

ఇంద్రాణిని తనకు భార్యగా ఎంపికచేసినట్లు నారాంబ చెప్పినప్పుడు స్థాణువైపోయాడు జాయపుడు. చాలాసేపు స్తబ్ధుగా ఉండిపోయాడు. ఇంద్రాణి తగిన వధువు అవునో.. కాదో తరువాతి అంశం. ఆమె ముమ్మడిని ఇష్టపడుతున్నదని పుళిందపుడు చెప్పాడు. ఆమె ముమ్మడితో మాట్లాడటం తను కూడా చూశాడు. ఇంద్రాణి రాజకు లీన వంశీయురాలు. ఆ ఆభిజాత్యం మిక్కుటం. అలాంటి ఆభిజాత్యమే ఒంటినిండా ప్రవహించే వ్యక్తి ముమ్మడి. ఆమె రాజాస్థానపు మార్గీ తరహా గొప్పగా యని. ఇవన్నీ బేరీజు వేసుకుంటూ ఆమెను అంగీకరించాలా.. తిరస్కరించాలా!? అనే రెండు నిర్ణయాలకు మధ్యగా నిలబడి ఉన్నాడు.

మరోవైపు ఇంద్రాణి ఎందుకు తనను అంగీకరించిందో.. ఎందుకు ముమ్మడిని తిరస్కరించిందో తెలుసుకోవాలన్న కుతూహలం అతనిలో పెరిగిపోతున్నది.

దూరంగా వస్తూ కనిపించాడు పుళిందపుడు. ఇద్దరి చూపులు కలవగానే పరుగు పరుగున దగ్గరికి వచ్చాడు.

కళ్ల గంతల ఘర్షణ తర్వాత.. జాయపుని ఎదుట ఎప్పుడూ చేతులు కట్టుకునే మాట్లాడతాడు పుళిందపుడు. కూర్చోమన్నా కూర్చోడు. ముమ్మడి అయితే మళ్లీ కళ్లముందు కనిపించలేదు. ఆ గొడవలవల్ల తన వాణిజ్య వ్యవహారాలు దెబ్బతీసేలా జాయపుడు వ్యవహరిస్తాడని పుళిందపుని భయం. సమావేశాల్లో, ఆటల్లో పాటల్లో అన్నిటిలో జాయపుణ్ని ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తూ.. అందరికీ గొప్పగా పొగుడుతూ ఆకాశానికి ఎత్తి మాట్లాడుతున్నాడు.. ప్రవర్తిస్తున్నాడు. ఆ సంఘటన నగరిలోని చాలామంది పెద్దలకు, యువకులకందరికీ తెలిసిందని.. జాయపునికి అంకమరట్ట విన్నవించాడు.

''శుభోదయం మిత్రమా..'' అన్నాడు జాయపుడు.

''శుభోదయం.. శుభోదయం సేనానీ! తమరు ఇక్కడ.. ఇప్పుడు..'' అర్ధోక్తిలో ఆపాడు.

''మీ మిత్రుని ప్రేయసి కోసం..'' అన్నాడు జాయప.

ఇబ్బందిగా ముఖంపెట్టాడు పుళిందపుడు.